بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 19 December 2025 (Telugu)

# అల్లాహ్ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంలో నిశ్చయంగా మీ కొరకు ఉత్తమ ఆదర్శం గలదు

**హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 19.12.2025 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ. أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ అల్ అహ్జాబ్ అధ్యాయపు 22వ సూక్తిని పఠించి దాని అనువాదాన్ని ఈ విధంగా సమర్పించారు: అల్లాహ్‌తో, పరలోక దినముతో కలియు నమ్మకమున్న వారి కొరకు, అల్లాహ్‌ను చాలా స్తుతించు వారి కొరకు, అల్లాహ్ ప్రవక్త వద్ద ఒక ఉత్తమ ఆదర్శం గలదు.

అనంతరం హుజూరె అన్వర్ ఇలా ఉపదేశించారు. ఎవరో ఒకరు హజ్రత్ ఆయిషా (రజి) ను మహనీయ హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి ఉన్నతమైన నైతికత మరియు ఆయన (స) ఆచరణాత్మక ఆదర్శం గురించి అడిగినప్పుడు, ఆమె "మీరు ఖుర్ఆన్ చదవలేదా!" అని సమాధానం ఇచ్చారు. అందులో అల్లాహ్ తఆలా స్వయంగా ఆయన (స) ఆదర్శం గురించి సాక్ష్యమిచ్చాడు. అల్లాహ్ తఆలా ఇలా సూచిస్తున్నాడు.

وَاِنَّکَ لَعَلٰی خُلُقٍ عَظِیۡمٍ (అల్ కలమ్:2)

అనగా "నిశ్చయంగా నీవు అత్యున్నతమైన నైతిక విలువలను కలిగి ఉన్నావు".

కావున ఎవరైతే ఏదైనా విషయంలో అత్యున్నత స్థానంలో ఉంటారో వారే ఆదర్శంగా నిలుస్తారు. మహనీయ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం విషయానికొస్తే అల్లాహ్ హక్కుల విషయంలోనైనా లేదా ప్రజల హక్కుల విషయంలోనైనా ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఆ రెండింటిలోనూ అల్లాహ్ సాక్ష్యమిచ్చిన అత్యున్నత స్థానాన్ని కలిగి ఉన్నారు. అందుకే అల్లాహ్ తఆలా మనతో ఇలా అన్నాడు: ఈ ప్రవక్త మీ కోసం ఒక ఆదర్శం. ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం మాటలు వినడమే కాదు వాటిపై ఆచరణ కూడా చేయండి! కేవలం విశ్వాసం సరిపోదు, మీరు ఆచరించినప్పుడు మాత్రమే నేను ఈ ప్రవక్తను పంపిన లక్ష్యాన్ని మీరు సాధించగలరు. ఇది మహనీయ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి స్థాయి. మహనీయ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్వయంగా ఇలా సెలవిచ్చారు: మీరు నా సున్నత్‌ను (పద్ధతిని) అనుసరించండి, నా ఆచరణల ప్రకారం నడవండి, ఎందుకంటే అల్లాహ్ తఆలా మిమ్మల్ని సంస్కరించడం కోసమే నన్ను అవతరింప జేశాడు. ఉత్తమ నైతికతను పరిపూర్ణం చేయడం

కోసమే నేను పంపబడ్డాను అని ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం సెలవిచ్చారు. కాబట్టి, నైతికతను పరిపూర్ణం చేసే వ్యక్తి ఆ గుణాలన్నింటినీ కలిగి ఉండాలి మరియు ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం లో ఆ లక్షణాలన్నీ ఉన్నాయి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని రజియల్లాహు అన్‌హు 'దీబాచా తఫ్సీరుల్ ఖురాన్' రచనలోనూ మరియు మన సీరత్ (జీవిత చరిత్ర) పుస్తకాలలోనూ ఆయన (స) నైతికత మరియు జీవిత విశేషాల గురించి విషయాలు ఉన్నాయి. వాటిలో కొన్నింటిని నేను నేడు క్లుప్తంగా వివరిస్తాను, భవిష్యత్తులో అవకాశం వచ్చినప్పుడల్లా వాటిని వివరంగా ప్రస్తావిస్తూ ఉంటాను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. మొదటి విషయం అల్లాహ్ తఆలా హక్కు, అంటే అల్లాహ్ ఆరాధన హక్కు అనబడుతుంది. ఇందులో మహనీయ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎలాంటి ఆదర్శం మనకు కనిపిస్తుంది? పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవితమంతా అల్లాహ్ ప్రేమలో మునిగిపోయి ఉండటాన్ని మనం చూస్తాము. కొత్త శాసనాన్ని అమలు చేయడం మరియు ప్రజలకు శిక్షణ ఇవ్వడం వంటి భారీ బాధ్యతలు ఆయన సల్లల్లాహు అలైహి వసల్లంపై ఉన్నప్పటికీ ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ హక్కును అంటే ఆరాధన హక్కును ఎన్నడూ మరచిపోలేదు. ఇది చాలా గొప్ప, ముఖ్యమైన విషయం. ఈ క్రమంలో ఆయనకు కష్టాలు ఎదురయ్యాయి, యుద్ధాలకు వెళ్ళవలసి వచ్చింది, శత్రువులు దాడులు కూడా చేశారు. కానీ అల్లాహ్ ఆరాధన హక్కును నెరవేర్చడంలో ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఎప్పుడూ వెనకాడలేదు. కనుక, మన ముందు ఉన్న ఆదర్శం ఇదే, మనం అన్ని పరిస్థితులలోనూ అల్లాహ్‌ను మన ముందుంచుకోవాలి అనగా గుర్తుంచుకోవాలి. మనం అల్లాహ్ తఆలాను గుర్తుంచుకున్నప్పుడు మన వివిధ సమస్యలు వాటంతట అవే పరిష్కరించబడతాయి. ప్రజలు తమ సమస్యల కోసం ప్రార్థనలు చేస్తారు కానీ అల్లాహ్ హక్కును నెరవేర్చరు, అందుకే మనిషి దైవానుగ్రహాలకు దూరమవుతాడు.

ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఆరాధనల స్థాయి ఎలా ఉండేది? మహనీయ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అర్ధరాత్రి దాటిన తర్వాత అల్లాహ్ ఆరాధన కోసం నిలబడేవారు మరియు దీని గురించి అల్లాహ్ తఆలా కూడా సాక్ష్యమిచ్చాడు. ఇదేవిధంగా ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ వాక్యాన్ని విన్నప్పుడు, ముఖ్యంగా ఆయన బాధ్యతలను గుర్తు చేసే సూక్తులు వచ్చినప్పుడు ఆయన (స) కళ్లలో నీళ్లు తిరిగేవి. ఒకసారి ఆయన (స) కోరిక మేరకు హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ రజియల్లాహు అన్‌హు అన్నిసా అధ్యాయాన్ని చదివి వినిపిస్తుండగా ప్రతి జాతి నుండి వారి ప్రవక్తను సాక్షిగా నిలబెట్టి ఆ జాతి లెక్కలు తీసుకుందుము. నిన్ను కూడా నీ జాతిపై సాక్షిగా నిలబెట్టి దాని లెక్కలు తీసుకున్నప్పుడు వారి పరిస్థితి ఎలా ఉంటుంది? అనే సూక్తి వరకు చేరుకోగానే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చాలు, చాలు అని అన్నారు. ఆ అనుచరుడు మాట్లాడుతూ, నేను ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం వైపు చూడగా ఆయన రెండు కళ్ళ నుండి కన్నీళ్లు కారుతున్నాయి అని చెప్పారు. ఆయన సల్లల్లాహు

అలైహి వసల్లంపై అంతటి దైవభీతి ఆవహించింది మరియు ఆ సమయంలో నిశ్చయంగా ఆయన తన జాతి గురించి ఆందోళన చెంది ఉంటారు. తన జాతి అల్లాహ్‌కు కోపం తెప్పించే పనులు ఏవైనా చేస్తే, తాను వారికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాల్సి వస్తుందేమోనన్న భయం ఆయనకు కలిగి ఉండవచ్చు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. నమాజ్ విషయంలో ఆయనకున్న శ్రద్ధను చూడండి! తీవ్రమైన అనారోగ్య స్థితిలో కూడా చివరి రోజుల్లో నమాజ్ కూర్చుని లేదా పడుకుని చదివే అనుమతి ఉన్నప్పటికీ ఆయన ఇద్దరు వ్యక్తుల సహకారంతో మసీదుకు వెళ్లారని చరిత్ర చెబుతోంది. ఇదేవిధంగా ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఆడంబరమైన లేదా బలవంతపు ఆరాధనలను ఇష్టపడేవారు కాదు. ఆరాధనల వైపు అంతగా ప్రోత్సహించినప్పటికీ అందులో కృత్రిమత్వం ఉండకూడదని ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం అనేవారు. మనసులో ఉత్సాహం ఉన్నంత సేపు మాత్రమే ఆరాధన చేయాలని, అలసిపోయినప్పుడు కూర్చోవాలని, బలవంతపు ఆరాధన వల్ల ప్రయోజనం ఉండదని ఆయన (స) సూచించారు.

హుజూరె అన్వర్ నేటి కాలపు ప్రజలకు ఒక విషయం ఇలా స్పష్టం చేశారు. దీని అర్థం కష్టపడాల్సిన అవసరం లేదని కాదు. కావున నమాజ్‌ను ఏదో ఒక భారంగా భావించి త్వరత్వరగా ముగించేయకూడదు. నమాజ్ ఎలా చదవాలి అని ఇక్కడ కూడా చాలా మంది నన్ను అడుగుతుంటారు. నమాజ్‌ను ఎంతో ఏకాగ్రతతో, శ్రద్ధగా, అందంగా చదవాలి.

అల్లాహ్ సన్నిధిలో ఆయన (స) వినయం ఎంత వరకు ఉండెననగా ప్రజలు ఆయనతో మీరు మీ ఆచరణల ద్వారా అల్లాహ్ అనుగ్రహాన్ని పొందుతారు, ఎందుకంటే అల్లాహ్ మీకు ధృవీకరణ ఇచ్చాడు మరియు మీ ఆదర్శాన్ని ముస్లింలకు ఒక ప్రమాణంగా నిర్ణయించాడు అని అన్నప్పుడు ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం లేదు! లేదు! నేను కూడా అల్లాహ్ దయతోనే క్షమించబడతాను అని అన్నారు. ఆ తర్వాత ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం హితబోధ చేస్తూ మీ పనులలో పుణ్యాన్ని అవలంభించండి మరియు అల్లాహ్ సామీప్యం కోసం మార్గాలను అన్వేషించండి అని చెప్పారు. అలాగే మీలో ఎవరూ మరణాన్ని కోరుకోకూడదని సెలవిచ్చారు. ఒకవేళ ఆ వ్యక్తి మంచివాడైతే, జీవించి ఉండటం వల్ల తన పుణ్యాలను మరింత పెంచుకుంటాడు. ఒకవేళ చెడ్డవాడైతే జీవించి ఉండటం వల్ల తన పాపాలకు పశ్చాత్తాపం చేసుకునే అవకాశం లభిస్తుంది. ఇది చాలా ముఖ్యమైన ఉపదేశం. మనం ఎప్పుడూ మరణాన్ని కోరుకోకూడదని గుర్తుంచుకోవాలి.

ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఆచరణల గురించి హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా ఒక చోట ఇలా ఉల్లేఖించారు. మహనీయ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ముందు రెండు మార్గాలు ఉన్నప్పుడు వాటిలోని సులభమైన మార్గంలో ఎలాంటి పాపం లేనంతవరకు ఆయన ఎల్లప్పుడూ సులభమైన మార్గాన్నే ఎంచుకునేవారు.

మానవ సంబంధాల విషయానికొస్తే దీనిని తన ఇంటి నుండే ప్రారంభిద్దాం. భార్యల పట్ల ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవర్తన ఎలా ఉండేది? అది ఎంతో దయతో మరియు న్యాయంతో

కూడి ఉండేది. నేటి కాలపు ప్రజలు కూడా దీనిని అర్థం చేసుకుంటే ఇళ్లలోని అనేక గొడవలు మరియు అశాంతితో కూడిన సమస్యలు పరిష్కారమైతాయి.

అల్లాహ్ ఆయన సల్లల్లాహు అలైహి వసల్లంకు అధికారాన్ని ప్రసాదించినప్పుడు కూడా ఆయన సల్లల్లాహు అలైహి వసల్లంకు సహనం ఎంత ఉండెననగా ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ప్రతి ఒక్కరి మాట వినేవారు. ఎవరైనా కఠినంగా ప్రవర్తించినా ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం మౌనంగా ఉండేవారు. కొన్నిసార్లు ప్రజలు ఆయన మార్గాన్ని అడ్డుకుని తమ అవసరాలను వివరించడం మొదలు పెట్టేవారు. వారు తమ మాట ముగించే వరకు ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం అక్కడే నిలబడేవారు. ఆ తర్వాతే ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ముందుకు వెళ్లేవారు.

హుజూరె అన్వర్ మాట్లాడుతూ, మహనీయ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి జీవిత చరిత్రలో ఆయన న్యాయం, ఇతరుల భావాలను గౌరవించడం, పేదల పట్ల శ్రద్ధ వహించడం వంటి మరెన్నో విషయాలు మనకు ఆదర్శంగా ఉన్నాయి. కాబట్టి ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఆదర్శాన్ని అనుసరిస్తూ నిజమైన ముస్లింలుగా మారడానికి ప్రయత్నించే శక్తిని అల్లాహ్ మనకు ప్రసాదించుగాక. ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం సందేశాన్ని ప్రపంచవ్యాప్తంగా చేరవేసేవారిగా, ప్రపంచాన్ని ఆయన పతాకం నీడన తీసుకువచ్చేవారిగా మనల్ని చేయుగాక. అల్లాహ్ తఆలా మనందరికి ఆ శక్తిని ప్రసాదించుగాక.

اَللّٰھُمَّ صَلِّ عَلٰی مُحَمَّدٍ وَّعَلٰی اٰلِ مُحَمَّدٍ وَّبَارِکْ وَسَلِّمْ اِنَّکَ حَمِیْدٌ مَّجِیْدٌ

(అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్ వ అలా ఆలి ముహమ్మదిన్ వ బారిక్ వ సల్లిమ్ ఇన్నక హమీదుమ్ మజీద్.)

ముగింపులో హుజూరె అన్వర్ గౌరవనీయులైన లయీక్ అహ్మద్ తాహిర్ (మురబ్బీ సిల్సిలా) గారి ప్రత్యక్ష అంత్యక్రియ ప్రార్థన మరియు గౌరవనీయులైన సీఫూ జాలూ నాయిబ్ సదర్ రీజియన్ సీగో మాలి గారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతునని ప్రకటించారు. మృతుల ఇద్దరి ఉత్తమ గుణాలను వివరించి, వారి పాప క్షమాపణ, ఉన్నత స్థాయి అంతస్తుల కోసం ప్రార్థించారు.

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔